

# చైతన్యరాహిత్యంలో స్త్రీ

## – పవని నిర్మల ప్రభావతి

పధ్నాలుగేళ్ళు అరణ్య వాసం చెయ్యటానికి బయల్దేరిన సీతారాములను లక్ష్మణుడు అనుసరించినప్పుడు అతని అర్ధాంగి ఊర్మిళ, భర్తను అనుసరించ లేకా, రాజాంతఃపురంలో జీవచ్ఛవంలా బ్రతకలేకా చైతన్య రాహిత్య స్థితిలోకి జారిపోయి దీర్ఘనిద్రను ఆశ్రయించింది.

ఆమెకా దుస్థితి కల్గించిన వారెవ్వరూ  ఆమె పట్ల జాలి చూపించ లేదు.

చరిత్ర కూడా ఆమె మానసిక పరిస్థితిని విశ్లేషించలేదు.ఈనాటి అధునాతన సమాజంలో కూడా ... పరిస్థితుల ప్రభావం వల్ల కొందరు స్త్రీలు ఎటువంటి చైతన్య రాహిత్య స్థితిని ఆశ్రయిస్తున్నారంటే అందుకు కారణం ఏమిటి?

మారుతున్న సమాజంలో కూడా స్త్రీలకు ఈ దుస్థితి తప్పక పోతే, ఇహ, అందరూ ఆశిస్తున్న 'మార్పు'కు అర్థం ఏమిటి?

నేటి సాంఘిక సమస్యలను కథా వస్తువుగా తీసుకుని అతి హృద్యమంగా మలచిన శ్రీమతి పవని నిర్మల ప్రభావతి గారి రసవత్తర నవల "చైతన్య రాహిత్యంలో స్త్రీ"

ప్రతి ఒక్కరూ తప్పక చదివి తీరాల్సిన నవల ఇది.

*(గత సంచిక తరువాయి)*

**శ్రీనివాసాచారికి** ఉపనయనం చేయించారు శేషాచారిగారు ఆ ఏడాదే. రోజూ సంధ్య వార్చటం చిరాకు ఆ పిల్లాడికి, కేశవ నామాలంటే తగని కోపం.

"పొన్లెద్దురూ, చిన్నతనం! ఆటకాయతనం వదల్లేదు" అంటూ సమర్ధిస్తుంది అనసూయ.

"ఈ వయసులో గురి కుదరాలి అనసూయా! ఈ వయసులోనే వేదం కంఠతా పట్టాలి. తర్వాత ఓ పట్టాన రాదు" అనేవారాయన.

"రాకుంటే ఏం? మీ తర్వాత వాడికి మళ్ళీ ఆలయ పనులు అప్పగిస్తారా ఏమిటి? వాడు చదువుకుని మరిదిగారిలా తాశిల్దారో, కలెక్టరో కావాలి."

"అవనీ, కానీ మన విద్య మనం ఎందుకు పోగొట్టుకోవాలి? మన సాంప్రదాయం మనం ఎందుకు కించపరచుకోవాలి?" అని శేషాచారి గారెంత గోల పెట్టినా అనసూయ, శ్రీనివాసాచారి ఇద్దరూ వినిపించుకోరు.

ఊర్మిళకు అన్నీ సందేహాలే ఆలయంలోకి వచ్చాక.

"పెదనాన్నా! గర్భగుడిలోకి స్త్రీలు ఎందుకు రాకూడదు? దేవుడికి కూడా స్త్రీ పురుష భేదమేమిటి? నీవు చేసినట్లే తిరుమంజనం వగైరాలన్నీ నేనెందుకు చేయకూడదు?" అందో రోజు.

"స్త్రీ పురుష భేదం దేవుడికి ఉందని కాదమ్మా! పురుషుని శారీరక మానసిక ప్రవృత్తులు సాధారణంగా నిష్కల్మషంగా ఉంటాయి. అతని శరీరానికీ, మనసుకీ కల్మషం అంటూకొనేందుకు వీలుండదు. తనేదేనా తప్పు చేశామన్న భావన వచ్చినా పురుషుడు పశ్చాత్తాపంతో తానై తాను దిద్దుకుని, పశ్చాత్తాపాగ్నిలో దగ్ధమయిన మనసుతో, త్వరలోనే పునీతుడు అవుతాడు. స్త్రీలు అలా కాదు రజస్వలానంతరం తిరిగి బహిష్టు ఆగిపోయే వయసు వరకూ స్త్రీలో సృష్టి సంబంధిత సర్వ ఔచిత్యా నౌచిత్యాలన్నీ జీర్ణించుకు పోతాయి. అవి బంధాలుగా హృదయాన్ని బంధిస్తాయి. ఆగ్రహానుగ్రహ నిగ్రహాలు, సాధింపు ధోరణిలో ఆమె హృదయాన్ని అంటి పెట్టుకు వుంటాయి. అవి ఆమె ప్రతి పనిలోనూ ప్రతిబింబిస్తుంటాయి.

పురుషునికి అలాకాదు. అతగాడు ఆగ్రహానుగ్రహ నిగ్రహాలు ఒకే రీతిలో తన మనసులో ఉంచుకుంటాడు. అవసరమైనంత మేరకే వాటిని ఉపయోగిస్తాడు. ఆ నిగ్రహ శక్తి పురుషునికి స్వతః సిద్ధంగా వుంటుంది వాటి తాలూకు తరంగాలను హృదయానికి తగలనివ్వడు.

భగవస్సాన్నిధ్యంలో పూజారిగా వుండే వ్యక్తి, భగవంతుడికి చేసే ప్రతి పనిలోనూ తాను ఒక విగ్రహానికి గాక తన దైవానికి చేస్తున్నానన్న నిరంతర సమాధి స్థితిలాటి భావన వుండాలి. అక్కడ మనసు, శరీరమూ, క్రియ ముప్పేట గొలుసులా ముప్పురితో లీనమై పోవాలి.

అది సగటు స్త్రీకి సాధ్యం కాదు. తన అందాన్ని గురించిన అతిశయం, తన అందం పట్ల ఆకర్షితులౌతున్న వారిపట్ల హేళనతో కూడిన గర్వం, తన బిడ్డలను గురించిన ఆలోచన, సంసారంలోని సమస్యలు... ఇలా ఆమెకు ఏకాగ్రత కుదరటం చాలా కష్టం. అందుకే స్త్రీకి భర్తే దైవంగా భావించి సేవించమనీ, ఇల్లు పిల్లలు ఇలా సంసారం చిత్తశుద్ధితో చేసుకుంటే మోక్షం ఉందనీ పెద్దలు చెప్పారు.

వివిధ ఆలోచనలతో ఆలయంలోని గర్భగుడిలో ప్రవేశించి విగ్రహాన్ని మైల పరచటం నిషిద్దమనే ఉద్దేశ్యంతోనూ, మంత్ర పూరితమూ యంత్ర పరివేష్టితమూ అయిన గర్భగుడి, ప్రాణప్రతిష్ఠ చేయబడిన మూలవిరాట్టు బహిష్టు అయ్యే స్త్రీ

స్పర్శ వల్ల మైలపడుతుందనీ, ఆరునెలలకు గానీ, ఆ మైల వదలదనీ, తిరిగి భారీ ఎత్తున సంప్రోక్షణ జరగాలనీ నిర్ణయించారు. ఇది అనాలోచితమైంది కాదు తల్లీ!"

"అలా అయితే దేవీ ఆలయాలలోని పూజారులు మగవాళ్ళే కదా! దేవీ విగ్రహం స్త్రీది కదా! అక్కడి పురుషులు రారే పూజారులుగా."

శేషాచారిగారు ఊర్మిళ వేపు ఆప్యాయంగా చూశారు.

"దేవీ ఉపాసన చాలా మహోన్నత మైనదమ్మా! జగన్మాతృ భావనతో సర్వేంద్రియాలు కేంద్రీకరించి చేయాలి దేవిపూజ. అమ్మవారి అభిషేకాది కార్యక్రమాలన్నే తాను ఆమె చిన్నారి బిడ్డననే భావంతో, ఆత్మార్పణ భావంతో చేస్తాడు పూజారి. కళ్ళకి గంతలు కట్టుకుంటారు, అమ్మవారికి అభ్యంగనాదికాలు, వస్త్రధారణ అయ్యేవరకు. ఇదో ఆచారం మాత్రమే, మాతృభావనలో పునీతుడయిన భక్తుడు తల్లి రూపంలో అందాన్ని గాక పారలౌకిక సౌందర్యాన్ని అవలోకిస్తూ ఆ సౌందర్యంలో తనూ అణురూపంలో ఐక్యమై పోయే భావన పొందుతాడు.

బ్రహ్మ విద్యలో స్త్రీలు చాలా తక్కువగా ఉన్నతికి చేరుకుంటారమ్మా. చెప్పానుగా స్త్రీలో స్వభావ సిద్ధంగా అతిస్వల్ప విషయానికే ఉద్రేక పడే మనఃస్థితి వుంటుంది. అంచేత ఎక్కడో ఒకానొక స్త్రీ తప్ప, నిజమైన యోగినులు, పూజారిణులు వుండరు. బ్రహ్మ విద్య కూడా వారిలో గర్వాన్నీ, అహంకారాన్ని తెస్తుంది."

"నాకలా లేదులే పెదనాన్నా. నాకు చెప్పు." అమాయకంగా అంది ఊర్మిళ.

ఆమె తల ఆప్యాయంగా నిమిరారు శేషాచారిగారు.

"నాకు తెలుసు తల్లీ నీ స్వభావం. నీ పెళ్లి అయ్యాక, సంవత్సరంలోగా దీక్ష యిప్పిస్తాను. నువ్వు చిత్తశుద్ధితో చేసుకుంటావనీ నాకు తెలుసు."

"దీక్ష ఎవరూ యివ్వొద్దు పెదనాన్నా, మీరే యివ్వండి."

"అలాగే అమ్మా."

అలా సాగిపోతుంటుంది సంభాషణ.

రంగనాథం, పద్మావతిలు వస్తారనుకున్న రోజు ఓ ప్రమాదం జరిగి పోయింది. వాళ్ళు ప్రయాణిస్తున్న టూరిస్టు బస్సు నెల్లూరు సమీపిస్తుండగా ప్రమాదానికి గురయింది. రంగనాథం, పద్మావతి అక్కడి కక్కడే మరణించారు.

శేషాచారి దూరపు బంధువు చెల్లెలి వరసయ్యే రంగమ్మ అనే విధవ, ఆమె పదేళ్ళకొడుకు రామచంద్రం ఆ బస్సులోనే వున్నారు. రంగమ్మ తీవ్ర గాయాలతో స్పృహ కోల్పోయి ఆస్పత్రికి తరలించబడింది క్షతగాత్రులతో. రామచంద్రం దిక్కు తెలియక వుండి పోయాడు.

రంగనాధం, పద్మవతిలకు దహన సంస్కారాలు అయ్యాక, రంగమ్మ పరిస్థితి విచారించేందుకు ఆస్పత్రికి వెళ్ళాడు శేషాచారి. ఆమె చివరి శ్వాస తీసుకుంటోంది. స్పృహ వస్తోంది పోతోంది. శేషాచారిగారిని అతి కష్టం మీద గుర్తుపట్టి, “అన్నయ్యా! రామచంద్రం...” అని మాత్రం అనగలిగింది.

ఆమె ఏం చెప్పదల్చుకుందో అది పూర్తి కాకుండానే ఆమె ప్రాణం అనంతవాయువుల్లో లీనమై పోయింది, ఆమె వేలికున్న అరకాసు బంగారు ఉంగరం తప్ప ఆమెదంటూ ఏ ఆస్తీ లేదని శేషాచారిగారికి తెలుసు. ఆమె వో వైష్ణవ ఆచారి డాక్టరు గారింట్లో వంటమనిషిగా ఉంటూ కొడుకును, తననీ పోషించుకొంటోందని ఆయనకు తెలుసు. రామచంద్రంది తనకు అదనపు బాధ్యతని తెలుసు. కానీ ఆ కన్నతల్లి కంఠంలో, చివరి శ్వాసలో చెప్పలేక మిగిలి పోయిన కోరికా తెలుసు. అందుకే ఏడుస్తున్న రామచంద్రాన్ని నిండు హృదయంతో దగ్గరకు తీసుకున్నారాయనగారు.

“రా నాయనా!” అన్నారు.

ఊర్మిళకు అంతా అయోమయంగా వుంది. ఏడుపు వస్తోంది పొంగి పొంగి. కానీ ఎంచేతో పెదనాన్న వోదార్పులో తను ‘వంటరిదాన్ని’ అనే భయం మాత్రం కలగలేదు.

అనసూయమ్మ పరిస్థితి మరోరకంగా వుంది.

ఊర్మిళ బాధ్యత ఇక తమమీద పడింది. అందుకామె బాధ పడటం లేదు. ఊర్మిళతో బాటు రంగనాధం ఆస్తి, డబ్బు అంత వస్తోందాయే!

కానీ భర్త అదనంగా తెచ్చి నెత్తి మీద పెట్టిన రామచంద్రాన్ని చూస్తుంటే ఆమెకు కంపరం కలుగుతోంది . దోవన పోయే శనిని, తద్దినాన్ని తగిలించుకొచ్చాడనిపించింది.

ఊర్మిళకు ఈ ఏడాదో, పై ఏడాదో పెళ్ళి చేసి పంపేస్తే మిగిలిన డబ్బా, ఆస్తీ శ్రీనివాసాచారికే అవుతాయి. సీతకీ గొప్ప సంబంధం తేవొచ్చు ముందస్తుగానే.

కానీ ఈ రామచంద్రం పోషణ, చదువూ అంతా తమ నెత్తి మీద వేసుకున్నాడు భర్త. నాలుగు మంత్రాలు, కేశవ నామాలు నేర్పించి గుడిలో తోసేస్తే పీడా వదిలి పోతుంది.

“శ్రీనివాసాన్ని అలా తోసెయ్యగలవా?” అదే పనిగా గొణుగుతున్న అనసూయను మందలించారు శేషాచారిగారు.

“శ్రీనివాసానికీ, రామచంద్రానికీ పోలికేమిటి?”

“ఏం? ఎందుకు లేదు? వాడు నీటి వాలుకు కొట్టుకు వచ్చాడు. వీడు గాలివాలుకు కొట్టుకు వచ్చాడు, వాడిది ఏ కులమో తమమో తెలీదు. అయినా మన బిడ్డగా, మన సాంప్రదాయ రీతులలో పెంచబడి, ఆలయ ప్రవేశార్హత కల్పింపబడ్డాడు. నిజానికీ రహస్యం ఎవరికేనా తెలిస్తే ఆలయ ప్రక్షాళనం చేయటంతో గాక పెరుమాళ్ళ కింత అపచారం చేశానని నన్నూ, మన కుటుంబాన్ని వెలివేద్దురు. బహిష్కరిద్దురు. కానీ ఆనాడు ఏ నాడూ...

“జన్మనా నాయతే శూద్రః

కర్మణా నాయతే ద్విజః

వేద పాఠేన విప్రత్వం

బ్రహ్మ జ్ఞానంతు బ్రాహ్మణః

అనే విశ్వాసంతో వున్నాను గనుక, పెరుమాళ్ళుకు అపచారం చేశానని అనుకోవటం లేదు నేను. రామచంద్రం మా దూరపు బంధువు. చెల్లెలి వరసయ్యే రంగమ్మ బిడ్డ. రంగమ్మ రామచంద్రాన్ని కన్నాక ఆమె భర్త చనిపోయాడు. ఆమె మన ఎవరి పంచకూ రాలేదు. తన రెక్కల కష్టంతోనే తాను బ్రతికింది. బిడ్డను పెంచుకుంది. నిప్పులా నిలిచి పోయింది. విధివశాత్తూ చనిపోయింది. రామచంద్రంలో వంక చూపేందుకు ఏవుందని? వాడూ మనింట్లో ఒకడిగా ఉంటాడు. నువ్వన్నట్లు ఆలయ పూజా విధులన్నీ నేర్పిస్తాను. వీలైతే ఆలయంలోనే పని చేయిస్తాను. కానీ వాడు మన శ్రీనివాసంలాగాక, చదువులో పైకి వచ్చే లక్షణాలుంటే పయికి చదివిస్తాను” అన్నాడు శేషాచారిగారు.

మండి పడింది అనసూయమ్మ, “డబ్బు ఎక్కణ్ణించి వస్తుంది?”

“నిజం చెప్పు అనసూయా! రంగనాథం, పద్మావతిలు చనిపోయారన్న దిగులు నీకుందా? నిజంగా వుంటే, వాళ్ళు చనిపోయి కర్మ అయ్యీ కాగానే నీవే స్వయంగా వెళ్లి వాళ్ళ తాలూకు వస్తువులు, పెట్టెలు, బీరువాలు అన్నీ మన ఇంటికి తరలించుక వస్తావా? ఎంత ఆత్రం వుంది నీ పనుల్లో? ఎంత ఆశ వుంది నీ చేతలలో! అదంతా ఊర్మిళ సొత్తని తెలుసు. అయినా ‘ఆబ’గా పట్టుకొచ్చి స్వంతం చేసేసుకున్నావు. రంగనాథం ముందు చూపు కొద్దీ ఊర్మిళ పేరుతో బ్యాంక్ లో ఫిక్స్ డ్ డిపాజిట్ గా ఉంచాడు గనుక సరిపోయింది. లేకుంటే ఆ డబ్బూ లాక్కుందువు. ఈ సరికే ఊర్మిళ నగలు కొన్ని సీత మెడలో వేసేశావు కూడాను.

ఊర్మిళతో లాభం వచ్చిందని స్థిమితపడ్డావు. రామచంద్రంది ఆ లాభం తాలూకు బాధ్యత అనుకో.”

అనసూయమ్మ లోలోపల విసుక్కుంది. భర్త తన కొడుకు రహస్యం ఎవరికీ వెల్లడి చేయకుండా వుంటే అంతే చాలని కంగారు పడింది కూడా. అయిష్టంగానే ఆమె రామచంద్రం బాధ్యత తీసుకుంది.

రోజులు గడుస్తున్న కొద్దీ ఆ యింట్లో ఊర్మిళ గౌరవం, రామచంద్రం స్థానం పనిపిల్లల స్థాయికి దిగి పోయాయి.

మెల్లి మెల్లిగా అనసూయమ్మకు 'ఆయాసం' వస్తోంది. అయిందానికీ కానిదానికీ 'నాకు గుండె నెప్పి, ఆయాసం' అంటూ పడక పెట్టేస్తుంది.

"సీతా!ఇలా రామ్మా! నా పక్కన కూర్చుని వెన్ను రాస్తూ కూర్చో" అంటూ నేర్పుగా సీతని తన పక్కన కూర్చోబెట్టుకుంటుంది.

"ఊర్మిళా! నా తల్లివి కదూ! నా ప్రాణానికి ఈ జబ్బొకటి దాపురించింది, నీ చేత నా కాళ్ళు పట్టించుకోవటం నాకిష్టం లేదు. ఆ పని సీత చేస్తుంది. ఆ మడిబట్ట చుట్టబెట్టుకుని కాస్త వంటపని చూడు తల్లీ! ఒరేయ్ రామచంద్రం! నువ్వు మడిబట్ట కట్టుకుని నీళ్ళు పట్టుకు రారా! ఊర్మిళకి సాయం చెయ్యి."

అలా ఇంటిపనిలోకి మెల్లిగా దించేసింది. ఏ రోజుకారోజు ఏదో ఓ సాకుతో ఇంటిపనీ, వంటపనీ ఊర్మిళకి అంటగట్టేసింది.

తెల్లారురఝామున లేచి పై పనులన్నీ చేయటం రామచంద్రం వంతయింది. రెండు నెలలు తిరిగే సరికి శేషాచారిగారికి అర్థమై పోయింది, ఇక అనసూయకు ఈ 'జబ్బు' తగ్గదని.

రామచంద్రాన్ని స్కూల్లో చేర్పించారు. ఊర్మిళని కాలేజిలో చేర్పిద్దామనుకున్నారు. రంగనాధం, పద్మావతిలు ఆ అమ్మాయిని డాక్టర్ని చేయాలని ఆలోచిస్తుండిన సంగతి ఆయనకు తెలుసు.

కానీ అనసూయమ్మ ఆయనగారి ఆలోచనని మరో రకంగా ఎదుర్కొంది. ఆమెకు తెలుసు డాక్టర్ కోర్సు ఐదేళ్ళకీ పాతికవేలు పైగా అవుతుంది. ఊర్మిళ డబ్బు సాంతం అయిపోతుంది చదువుకి. తర్వాత ఆ అమ్మాయి గొప్పగా 'డాక్టర్' అవుతుంది.

తన కూతురు సీతకు లేని గొప్ప ఆ పిల్లకు వస్తుంది. మళ్ళీ ఊర్మిళకు పెళ్లి చెయ్యాలి తాము. రంగనాధం ఇల్లు అమ్మితే లక్ష రూపాయలు వస్తుంది. కానీ ఆ ఇల్లు అమ్మడానికి లేదు. అది శ్రీనివాసాచారికి దక్కాలి. ఈ పాతిక వేలలోనే సీత పెళ్ళికి కొంత తీసుకోవాలి. మిగిలిన దానితో ఊర్మిళ పెళ్లి చేసెయ్యాలి. తర్వాత అల్లుడి రాకపోకలకని, కాన్పులకని ఆ

ఇల్లు 'ఖర్చు' అయిపోయినట్లు అప్పు చూపాలి. ఇంత ప్లాను మనసులో వున్నా అనసూయమ్మ భర్తను మరో రకంగా ఎదుర్కొంది.

"ఈ ఏడాది సీత పెళ్లి చేసేద్దాం. ఈ లోగా ఊర్మిళకూ మంచి సంబంధం కుదుర్చుకుని చేసేద్దాం. ఎందుకొచ్చిన చదువులు? డాక్టరు కోర్సు కోసం పిల్లని పరాయి ఊరు పంపను గాక పంపాను. రేప్పొద్దున ఏ నింద వచ్చినా, 'దాని ఆస్తంతా ఆఫళంగా లాక్కున్నారు. దేశం మీద వదిలేశారంటుంది' లోకం. వాళ్ళమ్మ నాన్నలు బ్రతికుంటే వాళ్ళేలా చేసుకున్నా ఫర్వాలేదు గానీ మనం ఎంత ప్రేమగా చేసినా కొన్ని పనులు వికటిస్తాయి."

శేషాచారిగారిక్కూడా ఈ ఆలోచనలో కొంత నిజం వున్నట్లు తోచింది. అనసూయలో ఆశ వుంది. కాదనడానికి లేదు. కానీ ఆమె చెప్పే విషయంలో కొంత దూరాలోచన తనకూ గోచరం అవుతోంది, కొన్ని కష్ట నష్టాలు సాధక బాధకాలూ ఆలోచించదగినవే.

లోకం తెలియని ఆడపిల్ల. ఏమరుపాటుతో ఏదేనా ప్రేమ వ్యవహారంలో పడితే ప్రమాదమే. అంచేత మంచి సంబంధం చూచి పెళ్లి చేసి పంపటమే మంచిది.

ఓ రోజు ఊర్మిళను వెంటబెట్టుకుని ఆలయానికి వెళ్ళారు శేషాచారి. పూజ వగైరాలు పూర్తయ్యాక ఆలయ ఆవరణలోని మండపంలో కూర్చున్నారు ఇద్దరు.

"చూడమ్మా ఊర్మిళా! నాకూ తరచూ గుండె నొప్పి వస్తోంది. మీ పెద్దమ్మ సరేసరి. ఏ రోజు కారోజు అదే ఆఖరు రోజన్నంత అఘాయిత్యం చేస్తోంది. మీ నాన్నా అమ్మల మరణం కళ్ళారా చూశాక నాలో ఓ విధమైన నిర్వేదం చోటు చేసుకుంది తల్లీ. ఈ జన్మ తీసుకున్నాం. కొన్ని బాధ్యతల్ని కోరి నెత్తి మీద వేసుకున్నాం. ఆ బాధ్యతల తాలూకు బరువులే భార్యా బిడ్డలు వగైరాలంతా. మెల్లిగా ఆ బాధ్యతల బందాలు వదిలించుకుంటే ఆ తర్వాత ఆయుష్షు తీరితే వెళ్లిపోవటం. లేదూ యిలా ఆ శ్రీమన్నారాయణుడి పద సేవ చేసుకుంటూ ముక్తి మార్గంలో పయనించటం. అవునా? త్వరలోనే సీతకూ, నీకూ పెళ్ళిళ్ళు చేసి పంపటం మంచిదని తోస్తోంది నాకు. శీను ఉంటాడు. వాడి చదువుకు లోటు లేని ఆస్తి వుంది. చదువు పూర్తి కాగానే ఏదో ఉద్యోగం చూచుకుంటాడు. పెళ్లి చేస్తాము. అయిపోతుంది. నిన్ను డాక్టరు కోర్సులో చేర్పించటానికి, అది ఐదేళ్ళ కోర్సు తల్లీ. పూర్తయేసరికి నీకు ఇరవై రెండేళ్ళు ఇరవై మూడేళ్ళు పైగా వస్తాయి. అప్పుడు మన శాఖలో పెద్ద చదువున్న వరుణ్ణి తేవటం కష్టం కావొచ్చు. బహుశా మీ అమ్మ నాన్నలు జీవించి వుంటే వారికిది కష్టం అయ్యేది కాదేమో, కారణం వాళ్ళు నీ కన్న తలితండ్రులు. ఎలా చేసినా, ఏం చేసినా వారికి హక్కూ, బాధ్యతా వున్నాయి నీ విషయంలో.

నేను నీ పెదనాన్నని. నీకేలోటు జరిగినా, నీ విషయంలో తీసుకోబడిన నిర్ణయంలో పొరబాటు జరిగినా, నీ ఆస్తి కాజేసి నీకు అన్యాయం చేశానంటుంది లోకం. నువ్వు బాగా ఆలోచించు” అన్నారాయన మెల్లిగా, మృదువుగా.

ఊర్మిళ పెదనాన్న వంక చూసింది.

ఆయన సంసారంలో వున్నా విరాగి. సంసార యాత్ర సాగిస్తున్నా ఆ సాగర జలాల్ని తనలోకి రానివ్వని పడవలాటి వారు. దేహంతో వున్న విదేహి. ఆయనగారు తనయందు అపార వాత్సల్యంతో ఏ మాట చెప్పినా అది గురు బోధలాటిది. ఈ మూడునెలల్లో అది గ్రహించింది ఊర్మిళ. రోజూ ఆలయానికి ఆయనగారు వచ్చేశాక, ఏ టైంలోనో ఓ టైంలో ఊర్మిళ కూడా ఆలయానికి వచ్చి కూర్చుంటుంది ఆయన చేసే పూజా విధానాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తుంటుంది. పూజ నివేదన అయ్యాక, ఆయన విశ్రాంతిగా ఆలయం మంటపంలో కూర్చుంటారు.

భక్తిని గురించీ, భగవంతుని గురించీ ఎన్నో విషయాలు ఊర్మిళకు చెబుతుంటారు. ఆయనకు భగవంతుడి మీద అపార విశ్వాసం వుంది. అది మాటలలో తొణికిసలాడుతుంటుంది. ఆయనకు సన్నిహితురాలైన శ్రోత ఊర్మిళ ఒక్కర్తె.

“ఊర్మిళా! ప్రపంచంలోని ఎన్నో క్రిమి కీటకాలలానే మనిషి జన్మ తీసుకుంటాడు. అన్ని ప్రాణులలానే ఆకలి తప్పులు తీర్చుకుంటాడు. కానీ మనషి పుట్టినది మొదలు చనిపోయే లోగా వున్న మధ్య జీవితంలో ఏం చేసాడన్నది, ఎలా ప్రవర్తించాడన్నది, వాడి పూర్వజన్మ సంస్కారంతోనూ, ఈ జన్మలో వాడికి కల్పించబడిన వాతావరణంతోనూ ముడిపడి వున్నది. ఏలాటి మొండి తార్కికునికైనా జీవితంలోని ఒకానొక మలుపులో ‘నేనెవర్ని? ఎందుకోసం వచ్చానీ భూమ్మీదకు? మరణించాక నేనేమౌతాను? అసలు ఈ ‘నేను’ అనేది ఏమిటి? అనే జిజ్ఞాస మొదలౌతుంది. ఆ జిజ్ఞాసే అతనికి భగవంతుడి గురించి ఆలోచించటానికీ, భగవంతుని బాటలో సాగటానికి మార్గదర్శకం అవుతుంది. ఆ జిజ్ఞాస లేని లేదా కలగని జీవులే పశువులు, క్రిమి కీటకాలు. వాటి మెదడు వికసించ దేనాటికీ! ఆ మెదడులో ఆహార సముపార్జనకు తప్ప, మిగతా ఏ ఇతర విషయాలకూ ప్రాధాన్యత వుండదు. అంచేతే కాస్తయినా పాపభీతి, దైవభీతి లేని మనుషుల్ని పశువులతోనూ క్రిమి కీటకాలతోనూ పోల్చుతారు.

కానీ పశుజన్మలో కూడా కొన్ని ఉత్తమ సంస్కారం కలిగి వున్నట్లు పురాణాలు చెబుతుంటాయి.” ఇలా సాగిపోతుంది ఆయన వాగ్ధారి.

వింటున్న ఊర్మిళకు యింకా యింకా వినాలనిపిస్తుంటుంది. అందుకే ఇంట్లో పెద్దమ్మ పురమాయించే పన్లన్నీ పూర్తి చేసుకుని నైవేద్యం వండి జాగ్రత్తగా మూత పెట్టుకుని ఆలయం కేసి వచ్చి పెదనాన్న చెప్పే కబుర్లు వింటుంది.

"ఏమ్మా మాట్లాడవు? నీకిప్పుడు పెళ్ళాడటం ఇష్టం లేదా? డాక్టర్ కోర్సు చదువుతావా?" అన్నారు శేషాచారి, ఊర్మిళ ఏమీ పలక్క పోవటం చూచి.

"ఒద్దు పెదనాన్నా! మీ యిష్టం ఎలా వుంటే ఆలా చేయండి" అంది మెల్లిగా.

"మంచిదమ్మా" అన్నారాయన.

ఆ తర్వాత ధనుర్మాసం వచ్చింది. ఇంతక్రితం లాగా చీకటి వుండగా లేచి అనసూయమ్మ వండి యిచ్చేది నైవేద్యం. కానీ ఊర్మిళ యిక్కడే వుండి పోయాక నైవేద్యం వండే డ్యూటీ కూడా తెలివిగా ఊర్మిళకే అప్పగించింది అనసూయమ్మ.

శేషాచారిగారీ రోజు చాలా ఆనందంగా వున్నారు. ఆయనకు పదే పదే పురాణాలన్నీ గుర్తుకు వస్తున్నాయి. ఈ రోజు వైకుంఠ ఏకాదశి. అష్టాక్షరి గురుబోధ చేయగలిగితే మహాపుణ్యం. కానీ తగిన శిష్యులెవరు? ఇంకెవరు ఊర్మిళ, రామచంద్రంలే! తలి తండ్రుల్ని కోల్పోయిన ఊర్మిళ తననే తల్లి, తండ్రిగా భావిస్తోంది. గురువుగా గౌరవిస్తోంది.

అనసూయ తన భార్య. ఆమె ఏనాడూ తనని మానసికంగా అనుసరించలేదు. శారీరకంగా భార్య అంతే. ఆమె పుట్టింటివారు బాగా కలవారు. ఆ రోజుల్లో వారిది జమిందారీ కుటుంబంలా వుండేది. అప్పట్లో ఆస్తిపాస్తులేమీ లేక కేవలం పూజారి వృత్తి వంశ పారంపర్యంగా సంక్రమించే తనకిచ్చి చేయటానికి వాళ్ళ వాళ్ళు చాలా గుంజాటన పడ్డారు. కానైతే ఆరోజుల్లో ఆడపిల్ల పెద్దమనిషి కాకుండానే పెళ్లి చేసెయ్యాలని, అందునా తమ కులం, తమ శాఖ వారికే ఇచ్చి చేయాలనీ కఠిన నియమాలుండటం వల్ల ఎలాగోలా సర్దుకుని తనకే యిచ్చి చేశారు.

పేరుకు శ్రీ వైష్ణవులే, ఆచారులే అయినా, అనసూయమ్మ పుట్టింటివారు వుట్టి అనాచారులు. ఉదయం స్నానం సంధ్య ఎవరూ చేయరు. అంతా అనుకరణ, అట్టహాసం.

తను అత్తింట్లో ఎక్కువ రోజులు యెప్పుడూ గడపలేదు. ఎంచేతో డబ్బున్నా ఆ ఇంట్లో శాంతి లేదనిపించేది.

అనసూయమ్మనూ, తననీ, తమతో బాటే వుండిపొమ్మని 'వెధవ పూజారి' తనం వద్దు లెమ్మనీ అనసూయమ్మ అన్నదమ్ములు చాలాదూరం చెప్పి చూశారు. కానీ తను వినిపించుకోలేదు.

తన నియమ పాలన తనది.

అనసూయమ్మ కాపురానికి వచ్చాక, ఆమెకి భర్తలో లోపాలు, భర్త సాధారణ జీవితంలో 'సర్దుకు పోవటం' మాత్రమే బాధాకరంగా కనిపించేవి. ఆ తాలూకు అసహనం ఆమె నిరంతరం వాగ్రూపంలో బయల్పరిచేది. ఇలాటి స్త్రీలను తిట్టి కొట్టి మార్పు తేలేం. నచ్చ చెప్పనూ లేం. వాళ్ళ మనస్తత్వం ఇంతేనని సరి పెట్టుకోవటమో, మనకి మనమే సర్దుకు

పోవటమో, వారి మాటలు లక్ష్య పెట్టుకోక పోవటమో అలవర్చుకోవాలి. లేదూ కర్మ సిద్ధాంతాన్ని మనసారా నమ్మి, 'మన కర్మ ఇలా ప్రత్యక్షమైంది' అని సరి పెట్టుకోవటమో చేయాలి అనుకునేవాడు.

సీతకీ తల్లి పోలికలే వచ్చాయి. ఆమె కాళ్ళు నేలమీద, ఊహలు ఆకాశంలో విహరిస్తుంటాయి. శీను మాత్రం కాస్తంత తెలివితేటలూ, ఆలోచనా వున్న కుర్రాడు. కానీ వాడి ఆలోచనలన్నీ ఆడంబరం మీదా, డబ్బు మీదా కేంద్రీకరింప బడ్డాయి. తల్లి లాటి ధనదాహం వుంది వాడిలో.

"నాన్నా! నేను డిగ్రీ చదువు చదివాక మీ స్థానంలో నేనిక్కడ పూజారిగా స్థిరపడితే మీరు కించపడతారా? అమ్మలానే నేనో కలెక్టరునో మరేదో అయి బస్తీలో దర్జాగా బ్రతకలేదని అసంతృప్తి పడతారా?" అనడిగాడో రోజు.

తను నవ్వారు. "అలా ఏనాడూ అనుకోను శీనూ! డిగ్రీ చదువులు లోకజ్ఞానాన్ని ఇస్తాయి. ఈ మన వృత్తి పారలౌకిక జ్ఞానాన్ని ఇస్తుంది. అయితే ఇక్కడ చిత్తశుద్ధి చాలా అవసరం. మనం పూజిస్తున్నది, షోడశోపచారాలు చేస్తున్నది వో రాయికి అనుకుంటే అక్కడ మిగిలేది రాయి, నీ కంఠశోషే!

మనం పూజిస్తున్నది నామరూప రహితమైన పరబ్రహ్మ స్వరూపాన్ని అనీ, జడత్వంతో వున్న ఈ రాయి( విగ్రహం) లానే జడత్వంలో మునిగి వుండే మన హృదయాన్నీ, ఆత్మనీ నిత్య పూజా విధానంలో మేల్కొలిపి, దైవ సాక్షాత్కారాన్ని, జాగృతినీ పొందాలనీ అనుకోవటం ఒక్కటే చాలదు. అలా మనస్ఫూర్తిగా నమ్మగలిగితే పూజారి వృత్తిలో లీనమై పోవచ్చు నాయనా!

కేవలం హారతి పళ్ళెంలో పడే చిల్లర డబ్బులమీద దృష్టి నిలిపి అష్టోత్తరాలు అర్థం కాకుండా చేస్తున్న చాలామంది పూజారుల వల్ల పూజారులు అంటే చులకన భావమూ, దైవం మీద నిరసన, గుళ్ళూ గోపురాల మీద నిర్లక్ష్య భావనా కలుగుతున్నాయి ప్రజలలో. నీ వృత్తి పట్ల చిత్తశుద్ధి లేని నాడు ఇతరులను నీ మార్గానికి తేలేవు. ఇతరులకు బోధించలేవు. ముందస్తుగా అది నీలో వుందో లేదో అంచనా వేసుకో.

ఇక బ్రతుకుతెరువు సాగటం అనే ప్రశ్న వుంది. పుట్టిన ప్రతి వ్యక్తీ పెద్ద పదవులలోకి  పాకలేదు. చదివిన ప్రతివ్యక్తీ కలెక్టరో, మినిష్టరో కాలేదు. తృప్తి అన్నది వుంటే ఎక్కడైనా వున్న వనరులలో తృప్తిగా జీవించవచ్చు" అని.

శీను చాలా చలించి పోయాడు. "నాన్నా!" అన్నాడు కంఠం పూడుకుపోగా.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments